క్లుప్తంగా

జిల్లా కమిటీ ఎన్నిక


లలిత, అధ్యక్షురాలు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో ఈనెల 16వ తేదీన జరిగిన అసోసియేషన్ 3వ మహాసభలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా బానోత్ లలిత, ప్రధాన కార్యదర్శిగా రామగోని ఎల్లారీశ్వరీతోపాటు 20 మందితో కమిటీ ఎన్నుకున్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఖమ్మం జిల్లాకు బదిలీ అయిన అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డీఈ సీహెచ్ ఉపేందర్, టీపీఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంతో ఇబ్బందులు



డోర్నకల్: డోర్నకల్‌లో రైల్వే స్థలంలో ప్రహరీ నిర్మాణంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, ఎంపీ కవిత మంగళవారం హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా విలియం జాన్సన్, వెంకటేశ్వర్లు, వీరస్వామి, పద్మారావు పాల్గొన్నారు.

ఎన్నిక ఏకగ్రీవం

డోర్నకల్: కార్యాలయ మీటింగ్ హాలులో ప్రగతి సహాయ సహకార పొదుపు పరపతి, మార్కెటింగ్ మండల సమాఖ్య లిమిటెడ్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. అనంతరం మండల సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా స్వరూప, ఉపాధ్యక్షురాలిగా పి.ఉమ, సహాయ కార్యదర్శిగా స్వరూప ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలునాయక్, జెడ్పీటీసీ కమలారామనాథం, ఎంపీడీఓ అపర్ణ పాల్గొన్నారు.

శిక్షణను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు మండల రిసోర్స్‌పర్సన్లకు నిర్వహించనున్న జిల్లాస్థాయి శిక్షణను విజయవంతం చేయాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎంఈఓ, ఎంఎల్ఓలకు చేపట్టిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణకు హాజరయ్యే డీఆర్పీలు తప్పకుండా ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు బోధించే రిసోర్స్‌పర్సన్లకు సంబంధించిన సబ్జెక్టు పుస్తకాలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సభ్యులు చంద్రశేఖర్ ఆజాద్, ఎంఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



మహబూబాబాద్: ప్రభుత్వ బాలసదనంలోని పిల్లలను విద్యాపరంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవనంలో బాలసదనంలో బాలికలకు స్కూల్ బ్యాగులు, నోట్స్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు ఉంటే ఉంటే చైల్డ్‌లైన్ 1098 ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్, డాక్టర్ అశోక్, కోఆర్డినేటర్ లక్ష్మి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మానుకోట జిల్లాలోని కంకరబోడ్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు అయిన పాఠశాలలో స్కావెంజర్లు నియమించాలని, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. పీఆర్సీ పాత బకాయిలను వెంటనే చెల్లించాలని నూతన పీఆర్సీ అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులచే సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంజిరాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌పీసీ సంఘం నాయకుడు బత్తుల శ్రీనివాస్ కోరారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గజ్జి మల్లేష్, సోమా రవి, తేజావత్ రవీందర్, చందా, మల్లయ్య, పాపయ్య, సులోచన, భద్రాసింగ్, యాకలక్ష్మి పాల్గొన్నారు.


మహబూబాబాద్ అర్బన్: హెచ్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

బయ్యారం: విద్యారంగ సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలం అయిందని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బయ్యారంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన సమావేశంను ఉద్దేశించి టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, టీటీఎఫ్, ఏటీఎఫ్ నాయకులు యాకూబ్, శ్రీశైలం, రూప్లానాయక్, కృష్ణ మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతాలు ఉండాలన్నారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంజీ, రమణమ్మ, మీరా, వెంకన్న, కౌసల్య, అరుణ, రవీందర్, మంగీలాల్, దస్తగిరి, లక్ష్మయ్య, ప్రవీణ్, సుధాకర్, కిషన్ పాల్గొన్నారు.



గూడూరు: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


బయ్యారం: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రైతు బాగుతోనే రాష్ట్రం బాగు

● ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం/నెల్లికుదురు: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాల, ఇనుగుర్తి, నెల్లికుదురు చిన్ననాగారం గ్రామ రైతువేదికల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులకు ఉచిత కరెంట్‌పై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కష్టాలు వర్ణనాతీతమని విమర్శించారు. గతంలో అసెంబ్లీలో నీటి ఇబ్బందులపై రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులకు చూపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు బషీర్‌బాగ్ రైతుల కాల్పివేత పునరావృతం అవుతుందన్నారు. ఓటు అడగడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తే రైతులంతా ఉచిత విద్యుత్‌పై నిలదీయాలని అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాలలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో సమావేశంలో సర్పంచ్ ఆవుల కుమారి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, జెడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండా రాజశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీను, కేసముద్రంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ దార్ల రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం..

మల్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు వేల్పుల శేఖర్ ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను చూపించడానికి ప్రయత్నించాడు.


మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

‘ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్’


మాట్లాడుతున్న సోమేశ్వర్‌రావు

తొర్రూరు: ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని, ఈ హామీని ప్రకటించి అమలు చేసింది వైఎస్సారే అని మాజీ టీపీసీసీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్ రావు అన్నారు. డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సోమేశ్వర్ రావు మాట్లాడుతూ ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేసి ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ అమలు చేసి చూపాడని గుర్తు చేశారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని తహతహలాడుతున్నారన్నారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందిస్తుందన్నారు. రైతువేదికల్లో బీఆర్‌ఎస్ సమావేశాలు నిర్వహించడం, అధికారులు నిమ్మకుండటం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌రాజు, వెంకన్న, రాంపల్లి రవిలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

మహబూబాబాద్: గ్రంథాలయ పన్ను చెల్లించి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు కోరారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నవీన్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలోని జీపీలు, మున్సిపాలిటీలు ఎప్పటికప్పుడు వసూలు చేసిన గ్రంథాలయ పన్నులు తమ అవసరాలకు వాడకుండా గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో సంస్థ పాలక మండలి సభ్యులు నిమ్మల శ్రీనివాస్, పెద్ది సైదులు, ఉమా, డీఎల్‌పీఓ గంగాభవాని, సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నవీన్‌రావు

నేడు రైతు సదస్సు

గార్ల: మండలంలోని దుబ్బగూడెం రైతు వేదిక భవనంలో నేడు బుధవారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అధ్యక్షతన నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ మంగళవారం పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు మురళి, రాధాకృష్ణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు

గూడూరు: ఈ అనంత విశ్వలోకానికి సాక్షాత్తు శ్రీకృష్ణుడే జగద్గురువు అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక జిల్లా కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో మంగళవారం త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగద్గీతపై ప్రచారం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వివిధ కోర్సుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు మంగళవారం తెలిపారు. పోస్టులు ఖాళీల వివరాలు కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్‌లో-2, ఇంగ్లిష్‌లో -01, డైయిరీ సైన్స్-01, మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తు చివరి తేదీ ఈనెల 22, ఇంటర్వ్యూ తేదీ ఈ నెల 24న ఆయా కళాశాలలో ఉంటుందన్నారు. అర్హతలు సంబంధించిన సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులు ఉండాలన్నారు. పీజీ ఉత్తీర్ణత, నెట్, సెట్, పీహెచ్‌డీ, అనుభం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



గూడూరు: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఆరోగ్య మహిళ క్లీనిక్ స్టేట్ నోడల్ అధికారి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ వారం మహిళలకు నిర్వహించే ఆరోగ్య పరీక్షల రిజిస్టర్‌ను పరిశీలించారు. క్లీనిక్ విధులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు యమున, పుష్పలత, హెచ్ఈఓ లోక్యానాయక్, పీహెచ్ఎన్ కోమల పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

మరిపెడ: నులిపురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ హాలులో నులిపురుగు నివారణపై అవగాహన సదస్సును మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, సీడీపీఓ శిరీష, వైద్యాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహబూబాబాద్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం వైద్యులు అబ్దుల్, రూప ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20న అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు.


మరిపెడ: మాట్లాడుతున్న ఎంపీపీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గార్ల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గార్ల సీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని సీతంపేట పల్లె దవాఖానాలో గార్ల సీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ లావణ్య ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యుడు రాజ్‌కుమార్ జాదవ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అవినాష్, సాయిలక్ష్మి, నవ్యశ్రీ, హెచ్‌వీ బుజ్జమ్మ, ఏఎన్ఎంలు అనసూర్య, సడాలి, తార పాల్గొన్నారు.

డోర్నకల్: విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని గొల్లచర్ల పల్లెదవాఖానా వైద్యుడు డాక్టర్ వరుణ్ సూచించారు. మండలంలోని బొడ్రాయితండా గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గమ్మిరాజు, ఎంఎల్‌టీ రమ్య, ఏఎన్ఎం మరియమ్మ పాల్గొన్నారు.


గార్ల: వైద్య పరీక్షలు చేస్తున్న రాజ్‌కుమార్‌జాదవ్

పంచాయతీ కార్మికుల రాస్తారోకో


కేసముద్రం: రాస్తారోకో చేస్తున్న జీపీ కార్మికులు

కురవి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. సమ్మెలో సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్నలు సంఘీభావం తెలిపారు.

గార్ల: గార్లలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న మంగళవారం సందర్శించి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. బీఎస్పీ నాయకులు రామ్‌కుమార్, వాగ్యానాయక్, సంతోష్, సుధాకర్, వినోద్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

డోర్నకల్: జీపీ కార్మికుల సమ్మెలో భాగంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వంటావార్పు కార్యక్రమం చేపట్టారు.

కేసముద్రం: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ మంగళవారం కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో జీపీ కార్మికులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్, రాములు, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు శివారపు శ్రీధర్, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండలంలోని జీపీ ఉద్యోగులు, సిబ్బంది చేపట్టిన సమ్మెకు పలువురు మద్దతు పలికారు.

మరిపెడ: జీపీ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించకుండా మొండి వైఖరిని అవలంభించడం విడనాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. జీపీ సమ్మెకు సంఘీభావం తెలిపాడు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ స్వగృహంలో డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీస గ్రామానికి చెందిన కాంగ్రెస్, సీపీఎంల నుంచి మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

సంక్షిప్త సమాచారం

జీఓ 46ను సవరించాలి

గార్ల: తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేసే స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం జారీచేసిన జీఓ నంబర్ 46 ను తక్షణమే సవరించాలని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కార్యదర్శి ఏసుమల్ల రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

బ్యాగుల పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని అజ్మీరతండా, లాలీతండా, ఇల్లందకుంటతండా పాఠశాలల్లోని విద్యార్థులకు షిర్డీ సాయి సేవా ట్రస్ట్ వరంగల్ వారి సహకారంతో మంగళవారం నోట్ బుక్స్, బ్యాగ్‌లు వాటర్ బాటిల్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు అనిత, లలిత, మధులిక, రమ్య, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిసెవాసుల వంటావార్పు

కురవి: మండల కేంద్రం శివారు తిర్మాలాపురం జీపీ పరిధిలో పేదలు వేసుకున్న గుడిసెల వద్ద గుడిసెవాసులు వంటావార్పు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గుడిసెవాసులు ప్రతీ గుడిసె వద్ద వంటలు వండుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న మాట్లాడుతూ.. గుడిసెవాసులందరికి పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకన్న, రమేష్, నూరి, కృష్ణ పాల్గొన్నారు.

ఆందోళన చేపడతాం

గార్ల: అధికార పార్టీకి చెందిన దళితులకే దళితబంధు మంజూరు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన దళితులకు మాత్రమే దళితబంధు మంజూరు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో ఎంపీటీసీ ఎం వెంకట్‌లాల్, గుండా వెంకట్‌రెడ్డి, శంషాద్‌బేగం పాల్గొన్నారు.

రాజ్యాధికారానికి కృషి

గంగారం: బహుజనుల రాజ్యాధికారం కోసం ఎంఎస్‌పీ కృషి చేస్తుందని జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. గంగారం మండల కేంద్రంలోని మండల ఇన్‌చార్జి తీగల ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఈసం రమ సురేష్, బూర్క వెంకటయ్య, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి బూర్కయాదగిరి, సర్పంచ్ చింత బక్కయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాల్వ గండి పూడ్చాలి

చిన్నగూడూరు: కాలువకు పడిన గండిని తక్షణమే పూడ్చి చెరువుకు నీరందించాలని మండలంలోని విస్సంపల్లి రైతులు కోరుతున్నారు. చిన్నగూడూరు నుంచి విస్సంపల్లి మీదుగా వెళ్లే ఏటి కాలువకు గండిపడి నీరు వృథాగా పోయే ప్రమాదం ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

హామీలను అమలు చేయాలి

బయ్యారం: ఐకేపీ వీఓఏలకు మంత్రి దయాకర్ రావు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతనాలు ఇవ్వటంతోపాటు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ వెంకన్న, వీఓఏ యూనియన్ నాయకులు వసంత, కృష్ణకుమారి, శ్రీను, లలిత, సుజాత పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సర్పంచ్



పెద్దవంగర: హనుమకొండలోని విశ్రాంతి భవనంలో మండలంలోని పడమటితండా సర్పంచ్ ధరావత్ రాజేందర్ నాయక్‌తో గిరిజన నాయకులు మంళవారం మంత్రి దయాకర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ధరావత్ గణేష్, బుజ్జమ్మ, రాంకోటి, భూక్య అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా పండుగ

చిన్నగూడూరు: గిరిజనులు ప్రతి సంవత్సరం జరుపుకునే సీత్లా పండుగను గిరిజన పెద్దలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని విస్సంపల్లి పరిధిలోని ఆయా తండాల్లో గిరిజనలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

హీరో ప్రభాస్‌ను కలవడానికి కాలినడకన హైదరాబాద్‌కు..



డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లికి చెందిన వనపర్ల బాబు తన అభిమాన హీరో ప్రభాస్‌ను కలిసేందుకు మంగళవారం హైదరాబాద్‌కు కాలినడకన బయలుదేరాడు. గతంలో ప్రభాస్‌ను కలవాలని ప్రయత్నించినా కుదరకపోవడంతో కలవాలనే సంకల్పంతో తండ్రి వెంకటనర్సు దీవెనలు తీసుకుని బయలుదేరాడు.

రాహుల్‌గాంధీకి క్షమాపణ చెప్పాలి



నెల్లికుదురు: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ తనయుడు రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని మహబూబాబాద్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని కాచికల్, ఎర్రబెల్లిగూడెం గ్రామాలలో మంగళవారం స్థానిక నాయకులతో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి బాలాజి నాయక్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వర్షాలకు కురుస్తుండటంతో మంగళవారం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

క్రైం కార్నర్..

కుటుంబ కలహాల నేపథ్యంలో దాడి

బయ్యారం: కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధురాలు, యువతిపై దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అజ్మీరా కాంతి రెండో కుమార్తె నీలను అదే గ్రామానికి చెందిన బాణోత్ లింగ్య ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇరువురు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో కొన్ని సంవత్సరాలుగా ఉంటుండగా ఇటీవల వారి మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో లింగ్యపై నీల తరుపు బంధువులు హైదరాబాద్‌లో దాడి చేసి కొట్టారని ఆరోపిస్తూ లింగ్య కుటుంబసభ్యులు ఉప్పలపాడులో ఉంటున్న కాంతి, ఆమె చిన్నకుమార్తె విజయనిర్మలపై దాడి చేశారు. ఘటనలో విజయనిర్మల తలకు, చేతికి బలమైన గాయాలు కాగా కాంతి చెయ్యి విరిగింది. దీంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరి అరెస్ట్

కురవి: ఈనెల 13వ తేదీన మొగిలిచర్ల శివారు జగ్యాతండా జీపీలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు కురవి ఎస్సై బి.గోపి తెలిపారు. భూక్య గణేష్, లూనావత్ హుస్సేన్‌లను అరెస్టు చేసినట్లు వివరించారు.

షాపుల్లో చోరీ

బయ్యారం: మండల కేంద్రంలోని రెండుషాపుల్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్ సెంటర్‌లోని ఆదిత్య ఎలక్ట్రానిక్‌లోకి గుర్తుతెలియని వ్యక్తి తాళంను పగులకొట్టి లోపలికి ప్రవేశించటం సీసీ కెమెరాలో నమోదైంది. షాపులో ఉన్న రూ.3వేల నగదుతోపాటు రూ.12వేల విలువైన వస్తువులను అపహరించకపోయాడు. ఈషాపు పక్కనే ఉన్న విజేత సెల్‌షోరూంలో సైతం బ్లూటూత్‌లు, అడాప్టర్లు చోరీకి పాల్పడ్డాడు. ఈమేరకు బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ షాపులను పరిశీలించి క్లూస్‌టీం ద్వారా విచారణ నిర్వహిస్తున్నారు.

మహిళను తిట్టిన వ్యక్తిపై కేసు

దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన దాసరి మురళి సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన వీరబోయిన మమత, అను మహిళను ఇష్టం వచ్చినట్లు మాట్లాడి బెదిరించాడని, అమె భర్త వీరబోయిన కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

మరిపెడ హైస్కూల్‌లో చోరీ

మరిపెడ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. పాఠశాలలోని 9వ తరగతి తెలుగు మీడియం తరగతి గది కిటికి ఇనుప చువ్వలను తొలగించి గదిలోకి చొరబడ్డారు. పాఠశాల గదిలోని రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు ట్యాబ్ లైట్లను అపహరణకు గురైనట్లు హెచ్ఎం అనంతరావు తెలిపారు. ఇటీవల పాఠశాల ఆవరణంలోని మహాత్మ గాంధీ విగ్రహాన్ని కూడా ఇదే గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం పేర్కొన్నారు.

ఆకట్టుకున్న హెరిటేజ్ స్పెషల్ రైలు



డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్ మీదుగా మంగళవారం వరంగల్ వైపు వెళ్లిన హెరిటేజ్ స్పెషల్ రైలును స్థానికులు ఆసక్తిగా తిలకించారు. రైల్వే పూర్వ వైభవాన్ని ప్రచారం చేసేందుకు హెరిటేజ్ స్పెషల్ రైలును ఏర్పాటు చేశారు. పట్టణాలు, నగరాల్లోని రైల్వేస్టేషన్లలో ప్రదర్శన కోసం హెరిటేజ్ రైలును నిలపనున్నట్లు ఓ అధికారి తెలిపారు.